క్లుప్తంగా

కొల్లి నాగేశ్వరరావు సేవలు ఎనలేనివి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రైతాంగ పోరాట యోధుడు కొల్లి నాగేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో కొల్లి నాగేశ్వరరావు మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సాగు నీటి ప్రాజెక్టుల సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కొమ్మద్ది ఈశ్వరయ్య, ఎంవీ సుబ్బారెడ్డి, బాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజీవ్ గాంధీ ఆశయాలకు తూట్లు పొడుస్తోందన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాయకులు బండి జకరయ్య, సత్తార్, తిరుమలేష్, ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

కమలాపురం : విద్యార్థులు డ్రాయింగ్, వ్యాసరచన తదితర అంశాల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ వేయడంలో శిక్షణ నిచ్చారు. అనంతరం పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, కథల పుస్తకాలు చదవడం, నీతి కథలు చదవడంలో మెలకువలు నేర్పించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసే సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే వివిధ అంశాల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. అలాగే పుస్తక పఠనం అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏరాటు చేసి జంతుబలులు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

వీరపునాయునిపల్లె : అనిమెల గ్రామ సమీపంలోని కోరుకొండ వద్ద వెలసిన బోగాదమ్మ, తలపనూరు గ్రామ పంటపొలాల్లో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మూల మూర్తులను సుందరంగా అలంకరించారు. వేసవి సెలవులు కావడంతో తమ గ్రామాలకు వచ్చిన వారంతా కుటుంబ సభ్యులతో కలసి ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.

28 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ శిక్షణ తరగతులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల కార్పొరేట్ విద్యా వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు విద్యార్థి లోకాన్ని పోరాటాలకు సన్నద్ధం చేసేందుకు రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సునీల్, కుమార్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

కొత్త పీఆర్సీ కమిటీ వేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐదేళ్లు పూర్తి కావస్తున్నందున కొత్త పీఆర్సీకి కమిటీ వేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్, అలీఖాన్, చెంగల్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2023 జూన్ 30 నాటికి పీఆర్సీ గడువు ముగుస్తుందని, జులై 1, 2023 నుంచి కొత్త పీఆర్సీ గడువు ప్రారంభమవుతుందన్నారు. అలాగే పీఆర్సీ ఆలస్య కాలానికి ఇచ్చే మధ్యంతర భృతి కూడా జులై నుంచి ప్రకటించాలని కోరారు.

బాల పోలేరమ్మకు బోనాలు


అమ్మవారి ఊరేగింపు

కడప కల్చరల్ : కడప నగరం చిన్న బెస్తవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ జాతర ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. విశేష అభిషేకాల అనంతరం అమ్మవారికి కనుల పండువగా అలంకారం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తికి కూడా అభిషేకం ,అలంకారం నిర్వహించారు. ప్రత్యేకంగా భక్తులు సమర్పించిన నిమ్మకాయ దండలను అమ్మవారికి అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా పూల మాలలు, వేప మండలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచే స్థానిక భక్తులు తమ ఇళ్ల వద్ద నుంచి మేళతాళాలు, తప్పెట్లమధ్య అమ్మవారి బోనం పాత్రను తలపై ఉంచుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని బోనం సమర్పించారు. నిర్వాహకులు వారికి ప్రత్యేక దర్శనం, పూజలు నిర్వహింపజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని పులి వాహనంపై కొలువుదీర్చి స్థానిక వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన బాలల యోగా శిబిరం


మాట్లాడుతున్న రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి భీతి హరానంద

కడప కల్చరల్ : వేసవి సందర్భంగా స్థానిక పటేల్‌రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 21 రోజులపాటు నిర్వహించిన బాలల యోగా శిక్షణ శిబిరం ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి భీతి హరానంద మాట్లాడుతూ చిన్న పిల్లల్లో శారీరక, మానసిక ధృడత్వానికి, ఏకాగ్రత పెరగడానికి, నైతిక విలువలు అలవడడానికి యోగా సాధన ఉత్తమ మార్గమన్నారు. దైనందిన జీవితంలో ఆహారపు అలవాట్లకు కూడా ప్రాధాన్యత ఉందని, తాజాగా ఇంటిలో వండిన ఆహారానికే ప్రాముఖ్యత ఇవ్వాలని, పిజ్జాల, బర్గర్‌ల సంస్కృతికి దూరంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. యోగాసనాల సాధన వల్ల శారీరక దారుఢ్యంతోపాటు మానసికంగా ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కొనే సామర్థ్యం పిల్లలలో ఏర్పడగలదన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య, క్రీడాశాస్త్ర సంచాలకులు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులను తల్లిదండ్రులు యోగా సాధన వైపు ప్రోత్సహించాలని, విద్యార్థుల రోజువారి జీవితాలలో యోగా సాధన ఒక భాగం కావాలని, అప్పుడే పిల్లలు శక్తివంతమైన, ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. రామకృష్ణ మిషన్ స్వామిజీ సంకర్షణానంద, యోగా థెరపిస్టు డాక్టర్ కె.కల్పన, యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

29 నుంచి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడపలో ఈ నెల 29 నుంచి నిర్వహించనున్న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2016లో చేసిన పెద్ద నోట్ల రద్దుపై సీపీఎం చేసిన విమర్శ సరైందన్నారు. దేశంలో ఎదుర్కొంటున్న నల్లధనం, అవినీతి తీవ్రవాద కార్యకలాపాలకు నిధులు అందజేయడం వంటి సమస్యలకు పరిష్కారంగా డిజిటల్ చెల్లింపులు పెంపొందించడానికి మోదీ ఆర్భాటంగా 2016లో పెద్ద నోట్ల రద్దు చేశారని కానీ ఈ చర్య తిప్పి కొట్టిందన్నారు. ఈ సమస్యలపై సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం


దర్బార్‌పేట గ్రామంలో ఇంటిపై పడ్డ వేపచెట్టు

పెండ్లిమర్రి : మండలంలోని దర్బార్‌పేట, వెంకటాపురం, కొత్తపేట గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. దర్బార్‌పేటలో వేపచెట్లు, విద్యుత్ స్తంభాలు ఇళ్లపై పడ్డాయి. దర్బార్‌పేటలో నడిపెన్న, వెంకటసుబ్బయ్య ఇళ్లపై వేపచెట్లు పడటంతో ఇంటి రేకులు దెబ్బతిన్నాయి. వెంకటాపురం, కొత్తపేట గ్రామ పొలాల్లో సాగులో ఉన్న నిమ్మచెట్లు గాలికి నెలకొరిగాయి.

చెన్నూరులో భారీ వర్షం

చెన్నూరు : మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం పెనుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ అధికారులు ముందుజాగ్రత్తగా మూడు గంటల నుంచి విద్యుత్ నిలుపుదల చేశారు. ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించినట్లైంది. వర్షానికి భవానినగర్, స్టేట్ బ్యాంకు పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో నీరంతా రోడ్డుపై నిలిచింది. దీంతో స్థానికులు అవస్థ పడ్డారు.

పిడుగు పడి ఎద్దు మృతి

కొండాపురం : ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులకు పడిన పిడుగు వలన మండలంలోని సిరిగేపల్లె గ్రామానికి చెందిన అల్లపురెడ్డి వెంకటశివారెడ్డికి చెందిన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రూ.50 వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందటంతో వ్యవసాయ చేస్తూ జీవనం చేస్తున్న రైతుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు

ఘనంగా వైఎస్సార్ టీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

వేంపల్లె : ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఇడపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌వద్దకు చేరుకుని సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి నాయకులు ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఓబుళపతి, నాయకులు గిరిధర్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, అనంతపురం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి జాతర


పెనగలూరు: పురవీధులలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : గంగమ్మ జాతరను మండల పరిధిలోని తాళ్లపాక, శవనవారిపల్లి పంచాయతీలోని గొల్లవారిపల్లె దళితవాడలలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతరను సందర్భంగా తాళ్లపాక, శవనవారిపల్లి పరిసర ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి రాజంపేట మండలంతోపాటు సమీప మండలాల ప్రజలు తరలివచ్చారు. పొంగళ్లు పొంగించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ప్రత్యేక పూజలు

గంగమ్మ జాతరకు వచ్చిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలను కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేడా మధుసూదన్‌రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, దండు గోపీ, దాసరి పెంచలయ్య, ఎం.శ్రీనివాసులుగౌడ్, రమణారెడ్డి, జయరామ్‌నాయుడుతోపాటు నాయకులు పాల్గొన్నారు.

నడిమి సిద్దవరంలో..

పెనగలూరు : మండలంలోని నడిమి సిద్దవరంలో ఎల్లమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి నుంచి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నడిమి సిద్దవరంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. సిద్దవరం సర్పంచ్ రాఘవరెడ్డి ప్రేమలతరెడ్డి, వెంకటేష్‌రెడ్డి దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం పొంగళ్లు పెట్టుకొని మొక్కులను తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లిని గ్రామ పురవీధులలో మేళతాళాలు మధ్య ఊరేగించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు, గ్రామస్తులు

సిద్దవటం: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. సిద్దవటంలోని దిగువపేట, కమ్మపాలెం, అటవీ చెక్‌పోస్టు ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు ఆదివారం లైఫ్ ప్రొగ్రాంను, ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు మాట్లాడుతూ విద్యుత్‌ను పొందుపు చేయడం, ప్లాస్టిక్‌కు స్వస్తి పలకడం, మొక్కలు నాటడం, నీటి వృథాను అరికట్టడంపై విద్యార్థులు, గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడి, అటవీ జంతువులను పరిరక్షణపై అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ రాజశేఖర్‌రెడ్డి, ఏబీఓలు, ప్రొడక్షన్ వాచర్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, గ్రామస్తులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం

సిద్దవటం : గ్రంథాలయాలతో విద్యార్థులు సంపూర్ణ విజ్ఞానాన్ని పొందుతారని సిద్దవటం గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరానికి ఆదివారం 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులతో ధ్యానం, పుస్తక పఠనం, పద్యాలు చెప్పించి అనంతరం చదరంగం, క్యారంబోర్డు ఆడించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీహరి సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : చిట్వేలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గ్రంథాలయంలో ఆదివారం జరిగిన వేసవి శిబిరంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో కథలు చదివించడం, నేర్పించినట్టు గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు తెలిపారు. అలాగే చెస్, డ్రాయింగ్‌లు ఆడించినట్టు ఆయన తెలియజేశారు.

ఆర్‌జేడీకి సమస్యలపై వినతి

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని తుమ్మలపల్లెలో ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డికి పలువురు ఉపాధ్యాయులు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని తుమ్మలపల్లెలో గంగమ్మచింతలలో ఆదివారం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు రాజమోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

హనుమనగుత్తిలో ఘనంగా జ్యోతుల మహోత్సవం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని హనుమనుగుత్తి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారి ప్రతిష్ట జరిగి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా ఆదివారం గ్రామంలో జ్యోతుల మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో నషాన్


నషాన్ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలోని చాంద్‌పీరా గుంబద్ దర్గా ఉరుసు నషాన్ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లీ అమీరున్నీసా తమ ఇంటి నుంచి ఫకీర్ల మేళతాళాల సందడి మధ్య దర్గా వద్దకు గంధం కలశాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. గురువుల మజార్ వద్ద గంధాన్ని సమర్పించి ఫాతెహా చేశారు. దర్గా ఆవరణలో జెండా ప్రదేశంలో నషాన్ ఉత్సవం నిర్వహించి జెండాను అలంకరించారు. హాజరైనభక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక డివిజన్ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పట్టుదలతోనే విద్యావేత్తలుగా ఎదుగుతారు

డీబీసీడబ్ల్యూఓ బ్రహ్మయ్య


విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న డీబీసీడబ్ల్యూఓ బ్రహ్మయ్య

కడప రూరల్ : క్రమశిక్షణ, పట్టుదలతోనే విద్యావేత్తలుగా ఎదుగుతారని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి బ్రహ్మయ్య అన్నారు. ఏపీ రాష్ట్ర నూర్‌బాష్ దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరు చిన్న రాజా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక దూదేకుల భవన్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 60 మంది దూదేకుల విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులకు పట్టుదల, అంకితభావం ఉండాలన్నారు. ఆ రెండింటితోపాటు క్రమశిక్షణ తోడైతే ప్రతి ఒక్కరూ విద్యావేత్తలుగా ఎదగగలరని తెలిపారు. రిజిస్ట్రేషన్‌శాఖ రిటైర్డ్ ఐజీ సులేమాన్, కేపీ హుసేన్, ఓబులేశు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

మరిన్ని సేవలతో పేరు నిలుపుకుందాం


సర్టిఫికెట్లతో లయన్స్‌క్లబ్ సభ్యులు

కడప కల్చరల్ : ఆపదలో ఉన్న వారికి సేవలు అందించడంలో మనకున్న పేరును నిలుపుకునేందుకు మరింత కృషి చేద్దామని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస చిన్నపరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని గ్రాండ్ ఇన్ హోటల్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపన్నులను ఆదుకోవడంలో లయన్స్‌కు మంచి పేరు ఉందన్నారు. మరింత సేవా దృక్పథంతో సేవా నిరతిగల మానవతావాదులను కలుపుకుని ఇతర సంస్థలకు ఆదర్శంగా సేవలు అందిద్దామని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి విలయాలు సంభవించినప్పుడు అధికారుల సూచనల మేరకు తమ ప్రధాన కార్యాలయం ప్రతినిధుల ఆదేశాల మేరకు అవసరమైన ప్రాంతాలలో వెంటనే సేవలు అందించగలిగామని వివరించారు. కార్యదర్శి గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రస్తుత సభ్యుల సంఖ్య వివరాలు తెలుపుతూ భవిష్యత్తులో చేయదలుచుకున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. పలువురు సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన సభ్యులకు కేంద్ర కార్యాలయం పంపిన సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

ఎస్‌టీఎఫ్ కడప, పెండ్లిమర్రి మండల కార్యవర్గం ఎన్నిక


మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడపలోని అక్షర స్కూలులో ఆదివారం జరిగిన ఎస్‌టీఎఫ్ కడప, పెండ్లిమర్రి ఉపాధ్యాయుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కడప మండల అధ్యక్షుడిగా రామిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గాలి శ్రీనివాసులును ఎన్నుకున్నారు. పెండ్లిమర్రి మండల అధ్యక్షుడిగా ఆర్.ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ ఖాదర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎస్‌టీఎఫ్ నిరంతరం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శులు ఆవుల రామచంద్ర, వెంకటసుబ్బయ్య, జిల్లా నాయకులు సాగర్, అబ్దుల్ సలాం, రవిశంకర్, ప్రదీప్‌రెడ్డి, నాగమహేశ్వరయ్యలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ జాతర

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. గ్రామ శివారులోని పోలేరమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ ఆవరణలో పోలేరమ్మకు బోనాలు సమర్పించారు. బయనపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డిశ్రీకాంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె.సురేష్‌బాబులు జాతరలో పాల్గొని పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతిని ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్‌కు చెందిన బి.మల్లికార్జున్‌యాదవ్ రూ.50,116లు, ద్వితీయ బహుమతి బద్వేలు సమీపంలోని గోపవరం మండలానికి చెందిన నెమలయ్య రూ.40,116లు, తృతీయ బహుమతి చాపాడు మండలం పెద్దచీపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుశర్మలకు రూ.30,116లు, చతుర్థ బహుమతిని బద్వేలు మున్సిపాలిటీ గుంతపల్లె గ్రామానికి చెందిన ఎం.వి.ఎస్.చౌదరి రూ.20,116లు, పంచమ బహుమతిని వేముల మండలం రంగోరిపల్లె గ్రామానికి చెందిన ఎం.రామసుబ్బారెడ్డి వృషభాలు కైవసం చేసుకోగా వీరికి రూ.10,116లు బహుమతిగా అందజేశారు.

అంకాలమ్మకు మకరతోరణం బహూకరణ


వెండి మకరతోరణాన్ని అందించిన క్రిష్ణవేణమ్మ తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అంకాలమ్మ ఆలయంలో అమ్మవారికి పొలిశెట్టి వెంకటరత్నమయ్య, కృష్ణవేణమ్మ దంపతుల ఆధ్వర్యంలో వెండి మకరతోరణం అందజేశారు. ఆదివారం ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, ఈఓ. రమణలకు రూ.3.5 లక్షలు విలువచేసే 4.5 కిలో వెండి మకరతోరణాన్ని అందించి విశేష పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి క్రిష్ణవేణమ్మను ఆలయ మర్యాదలతో శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్యమఠం ఆవరణలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి సి.శివయ్య, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డిల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 23వ తేదీ ఉదయం అంకురార్పణ, నవకలశస్వపనం, 24న ఉదయం ధ్వజారోహణం, కుంభప్రతిష్ట, సాయంత్రం శేషవాహనంపై గ్రామోత్సవం, 25న ఉదయం చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, సాయంత్రం ఎదురుకోళ్ళు, 26న ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం హనమంత వాహనసేవ, 27న ఉదయం మూలమూర్తిహోమం, ఉత్సవబలి, సాయంత్రం గరుడవాహనంపై గ్రామోత్సవం, 28వ తేదీన ఉదయం అశ్వవాహనసేవ, చక్రస్నానము, సాయంత్రం ధ్వజావరోహణం, అనంతరం పుష్పయాగము కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

పులివెందుల రూరల్ : పట్టణంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం క్రికెట్ పోటీలను వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్‌నాయుడు, రంగాపురం మధుసుదన్‌రెడ్డి, కౌన్సిలర్ విజయ్ కుమార్‌నాయుడులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాపురం గ్రామానికి చెందిన ఆలమూరు సంజీవకుమార్ నాయుడు జ్ఞాపకార్థం మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్ పోటీలను పులివెందుల నియోజకవర్గ పరిధిలో నుంచి సుమారు 33 టీములు వచ్చాయన్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిని రూ.40.116 కౌన్సిలర్ విజయకుమార్ నాయుడు, రెండవ బహుమతిని రూ.20116 డీఎస్ఆర్ యువసేన నాయకుడు దేని, మూడవ బహుమతిని రూ.10116 వైఎస్సార్ సీపీ నాయకులు మదుసుధన్‌రెడ్డి అందజేయనున్నారు. చివరి రోజు ఫైనల్ మ్యాచ్ సందర్భంగా క్రీడాకారులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.